● చెదిరిన చప్టా..



అధ్వానంగా మారిన చెరువుమాధారం-మంగాపురం చప్టా

ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి మండలంలోని చెరువుమాధారం చెరువు అలుగు పోయడంతో కింద ఉన్న చప్టాతో పాటు రోడ్డు కూడా పూర్తిగా కొట్టుకుపోయింది. కనీసం కాలినడకన నడిచే పరిస్థితి లేదు. దీంతో మంగాపురం, వల్లభి, చెరువుమాధారం, రాయగూడెం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చెరువుమాధారం నుంచి మంగాపురం వెళ్లాలంటే సుమారు 20 కిలో మీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇక రైతులు పొలాల వైపు వెళ్లలేక ఇంటి వద్దే ఉంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చప్టా నిర్మించాలని, కనీసం మరమ్మతులైన చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. – నేలకొండపల్లి

● చేలల్లో ఇసుక మేటలు..



పొలాల్లో ఇసుక మేటలు..



దెబ్బతిన్న పత్తి పంటతో రైతు

తుపాను ప్రభావంతో పంటలకు భారీ నష్టం వాటిల్లింది. వరద తాకిడికి పొలాల్లో ఇసుక మేటలు వేసి, పంట చేలన్నీ కోతలకు గురైనట్లు అన్నదాతలు వాపోతున్నారు. భూములన్నీ ఊట పుట్టి పైర్లు ఎర్రబారడంతో దిగుబడి తగ్గి తమకు నష్టం వాటిల్లుతోందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గణేశ్వరంలో అజ్మీరాలాల్, కొర్రా రవి, రామ్మూర్తి తదితరులకు చెందిన పొలాల్లో ఇసుక మేటలు వేయగా.. అధికారులు తమ పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆర్థిక అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు. – రఘునాథపాలెం

● శరవేగంగా అలుగువాగు పనులు..



ఖానాపురం అలుగు వాగులో అడ్డంకులు తొలగించక ముందు, తర్వాత

నగరంలోని 10, 11వ డివిజన్ల పరిధిలో ఉన్న ఖానాపురం అలువు వాగు అడ్డంకుల తొలగింపు పనులు గత రెండు రోజులుగా శరవేగంగా సాగుతున్నాయి. వాగు ఆక్రమణలో ఉండడంతో వరద నీరు సాఫీగా సాగక డివిజన్లలోని చైతన్య నగర్, వరదయ్యనగర్, కవిరాజ్‌నగర్ తదితర కాలనీ నివాసాల్లోకి వరద నీరు వచ్చి చేతుతోంది. దీంతో ఆయా కాలనీవాసులు వాగు పరీవాహక ప్రాంతంలో అక్రమ కట్టడాలు నిర్మించడంతోనే ఇలా జరుగుతుందని ఇటీవల ధర్నా చేయగా.. కార్పొరేషన్ అధికారులు స్పందించి ఆరు జేసీబీల సాయంతో తొలగింపు పనులు చేపట్టారు. భవిష్యత్‌లో ఆక్రమణలు జరగకుండా వాగుకు ఇరువైపులా సీసీ వాల్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. – ఖమ్మంఅర్బన్

● అక్కడి చెత్త డంపింగ్‌యార్డ్‌కు..!



చెత్తను తరలిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

నయాబజార్ సమీపంలోని బైపాస్‌కు వెళ్లే రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో వేసిన చెత్తను మంగళవారం డంపింగ్‌యార్డుకు తరలించారు. తొలుత ముంపు ప్రాంతాల్లో తొలగించిన చెత్తను ఇక్కడ డంప్ చేశారు. మంగళవారం దీనిపై 'పేరుకున్న చెత్తతో దుర్గంధం'అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితం అయింది. దీంతో అధికారులు స్పందించి ఈ చెత్తను వాహనాల ద్వారా డంపింగ్‌యార్డుకు తరలించారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

క్లుప్తంగా

కేంద్ర మంత్రికి వినతి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం మున్నేటి వరదతో నష్టపోయారని ప్రజలు, రైతులను ఆదుకోవాలని బీజేపీ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఢిల్లీలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు వినతిపత్రం అందజేశారు. ఖమ్మంతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ వరదతో నష్టం ఎదురైందని వివరించిన ఆయన.. బీజేపీ ఆధ్వర్యాన బాధితులకు చేస్తున్న సేవలను వివరించారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన మాజీ జెడ్పీటీసీ

తిరుమలాయపాలెం: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను మంగళవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో మాజీ జెడ్పీటీసీ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బెల్లం శ్రీనివాస్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆకాంక్షించారు.

ఇంటింటి సర్వే

నేలకొండపల్లి: వరదల వలన విద్యార్థుల సర్టిఫికెట్లు, ఇతర డాక్యుమెంట్లు తడిసిపోయిన వారి కోసం మండల అధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు. కలెక్టర్ ఆదేశాలు మేరకు మంగళవారం మండలంలోని సుర్దేపల్లి, రామచంద్రాపురం, కట్టుకాచారం గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, ఐకేపీ ఏపీఎం అశోక్‌రాణి, ఈజీఎస్ ఏపీఓ ఆర్.సునీత, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న విద్యుత్ సిబ్బంది

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన బీల్యా అనే కార్మికుడు విద్యుత్ సిబ్బందికి చేదోడు వాదోడుగా ఉంటూ పనిచేసేవాడు. ఈక్రమంలో ఇటీవల బీల్యా భార్య మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు విద్యుత్‌శాఖ ఏఈ రవికుమార్ ఆధ్వర్యాన సిబ్బంది ఆర్థిక సాయం అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు.

బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మాణిక్‌రావు

నేలకొండపల్లి: నేలకొండపల్లి తహసీల్దార్‌గా జె.మాణిక్‌రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన గౌరిశంకర్ హన్మకొండ జిల్లాకు బదిలీ కావడంతో డిప్యూటీ తహసీల్దార్ అయిన ఇమ్రాన్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కాగా, మంచిర్యాల జిల్లా కాశిపేట తహసీల్‌లో డిప్యూటీ తహసీల్దార్ అయిన మాణిక్‌రావు పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు పలువురు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నియామకం



కొండం కరుణాకర్

ఖమ్మంరూరల్: మండలంలోని గోళ్లపాడు సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శిగా కొండం కరుణాకర్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలో జరిగిన శాఖ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి నండ్ర ప్రసాద్ మాట్లాడుతూ.. కార్మిక, కర్షక, కూలీల సమస్యల పరిష్కారానికి సీపీఎం పోరాటాలు చేస్తుందని తెలిపారు. ఈక్రమంలో పార్టీ బలోపేతానికి కరుణాకర్ ఎంతో కృషి చేశారని, భవిష్యత్‌లో పేదలకు పక్కా ఇళ్లు, ఇళ్ల స్థలాల సాధన కోసం మరిన్ని ఉద్యమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

వరద బాధితులకు భరోసా..



ఖమ్మంవన్‌టౌన్: సుందరయ్యనగర్‌లో నిత్యావసరాలు అందిస్తున్న ఎంపీ రఘురాం రెడ్డి



ఖమ్మంఅర్బన్: 4వ డివిజన్‌లో నిత్యావసరాలు అందిస్తున్న దయాకర్‌రెడ్డి, తదితరులు



ఖమ్మంక్రైం: దుస్తులు పంపిణీ చేస్తున్న అడిషనల్ డీసీపీ నరేష్‌కుమార్



ఖమ్మంరూరల్: నిత్యావసరాలు అందిస్తున్న రామకృష్ణ మఠం ప్రతినిధులు



తిరుమలాయపాలెం: డ్రమ్ములు అందజేస్తున్న ఆర్మీయూత్ సభ్యులు



ఖమ్మం మామిళ్లగూడెం: అన్నదానం చేస్తున్న హిస్పాన్, ఖమ్మం వెల్ఫేర్ బాధ్యులు



ఖమ్మంఅర్బన్: నిత్యావసరాల కిట్లను అందిస్తున్న మహేష్‌బాబు అభిమాన సంఘం నాయకులు

● ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని 29వ డివిజన్ సుందరయ్యనగర్ తదితర ప్రాంతాల్లో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మంగళవారం రాత్రి పర్యటించి బాధితులకు నిత్యావసరాల కిట్లు, దుప్పట్లు, కొబ్బరి నీళ్ల బాటిళ్లను అందించడంతో పాటు భోజన సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేశారు. అలాగే నగరంలోని 35, 47, 49వ డివిజన్లలోని వెంకటేశ్వరనగర్, మామిళ్లగూడెం, కృష్ణసాయినగర్‌లో ఉన్న మున్నేరు వరద బాధితులకు మంగళవారం తుమ్మల యుగేందర్ యువ సేన ఆధ్వర్యాన ఇంటింటికి వెళ్లి నిత్యావసర సరుకులు, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని మేయర్ నీరజ ప్రారంభించారు.

● ఖమ్మంక్రైం: హైదరాబాద్‌కు చెందిన సీపీ సునీల్‌దత్ స్నేహితులు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థ తెలంగాణ ఫెసిలిటేషన్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ సంస్థ పంపిన దుస్తులను మహిళా కళాశాల, స్వర్ణభారతి ఫంక్షన్‌హాల్ పునరావాస కేంద్రాల్లో ఉన్న మున్నేరు వరద బాధితులకు అడిషనల్ డీసీపీ నరేష్‌కుమార్ పంపిణీ చేశారు.

● ఖమ్మంరూరల్: మండలంలోని రాజీవ్‌గృహకల్ప, నాల్గో తరగతి ఉద్యోగుల కాలనీల్లో 500మంది వరద బాధితులకు మంగళవారం హైదరాబాద్‌కు చెందిన రామకృష్ణ మఠం ఆధ్వర్యాన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అలాగే జలగంనగర్‌లో పాలేరు నియోజకవర్గ యూత్‌కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాధితులు విద్యుత్ లేక ఇబ్బంది పడుతున్న దృష్ట్యా జెట్ కాయిల్స్, క్యాండిల్స్, శానిటరీ ప్యాడ్లు పంపిణీ చేశారు.

● తిరుమలాయపాలెం: ఆకేరు వరదలతో సర్వం కోల్పోయిన రాకాసితండా గ్రామస్తులు జల్లెపల్లి పునరావాస కేంద్రాల్లో ఉంటుండగా.. మంగళవారం మంగళవారం ఎన్‌ఆర్‌ఐ పేరెంట్స్ అసోసియేషన్, ఆర్మీ యూత్ ఆధ్వర్యాన నిత్యావరాలు, నీళ్ల డ్రమ్ములు అందించారు. అలాగే అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ అధ్యక్షుడు కె.అయ్యప్పదాస్, జాతీయ కార్యదర్శి బేతి తిరుమల్‌రావుల సూచనల మేరకు తెలంగాణ రాష్ట్ర కమిటీ తరఫున రాకాసితండా వరద బాధితులకు నిత్యావసర వస్తువులు, చీరలు, లుంగీలు, టవళ్లు అందించారు.

● ఖమ్మం మామిళ్లగూడెం: మున్నేరు వరద ప్రాంత వాసులకు హిస్పాన్ (హెల్త్, ఎన్విరాన్మెంట్ సోషల్ సొసైటీ ఫర్ ఆల్‌నేషన్స్) ఎన్జీఓ, ఖమ్మం వెల్ఫేర్ గ్రూప్ సంయుక్త ఆధ్వర్యాన మంగళవారం రాత్రి ధంసలాపురం, రాజీవ్‌గృహకల్ప, సారధినగర్ తదితర ప్రాంతాలలో అన్నదానం చేశారు. అలాగే సువిధ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తరఫున మోక్షితాస్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యాన మంగళవారం మున్నేరు వరద బాధితులకు బియ్యం, కందిపప్పు, మంచి నూనె తదితర నిత్యావసరాలు అందించారు. అదేవిధంగా నగరంలోని బ్రాహ్మణబజార్, కన్యకాపరమేశ్వరి ఆలయం, 30వ డివిజన్లలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతుల మీదుగా బీజేపీ ఆధ్వర్యాన నిత్యావసరాలు అందించారు. అంతేకాకుండా శ్రీరక్ష ఆస్పత్రి అధినేత డాక్టర్ గొంగూర వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన పంపింగ్‌వెల్ రోడ్‌లో 300 మందికి నిత్యావసరాల కిట్లను అందించారు.

● ఖమ్మంఅర్బన్: నగరంలోని పలు కాలనీల్లో వరద బాధితులకు సినీ నటుడు మహేశ్‌బాబు అభిమాన సంఘం ఆధ్వర్యాన నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. అలాగే నగరంలోని 59, 60 డివిజన్లలో టీడీపీ నాయకుడు కూరపాటి వెంకటేశ్వర్లు ఆర్థిక సహకారంతో మంగళవారం 200 దుప్పట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా నగరంలోని 4వ డివిజన్ మంచికంటినగర్‌లో వరదల వల్ల నిరాశ్రయులైన పేదలకు వంటికొమ్ము శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన 25 కేజీల రైస్ బ్యాగ్‌లు, నిత్యావసర సరుకులను మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి చేతుల మీదుగా అందించారు. అంతేకాక హోప్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యాన నగరంలోని ధంసలాపురంలో వరద బాధితులైన 700 కుటుంబాలకు దుప్పట్లు, బెడ్ షీట్లు పంపిణీ చేశారు.

'నా ఖమ్మం కోసం నేను'కు విశేష స్పందన



తిరుమలాయపాలెం: సంతలో విరాళాలు సేకరిస్తున్న దృశ్యం

తిరుమలాయపాలెం/ఖమ్మంగాంధీచౌక్: వరదలతో సర్వం కోల్పోయిన ప్రజలను ఆదుకునేందుకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రవేశ పెట్టిన 'నా ఖమ్మం కోసం నేను'అనే కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుంది. తిరుమలాయపాలెంలోని వినాయక మండపాల వద్ద ఏర్పాటు చేసిన బాక్స్‌లలో ప్రజలు వస్తువులను విరాళాలుగా అందిస్తుండగా.. మంగళవారం పంచాయతీ కార్యదర్శి సునీత ఆధ్వర్యాన సంతలో విరాళాలు సేకరించారు. అలాగే లయన్స్ క్లబ్ ప్రతినిధి బృందం మంగళవారం కలెక్టర్‌ను కలిసి వరద బాధితుల కోసం తాము సిద్ధం చేస్తున్న నిత్యావసర వస్తువుల వివరాల గురించి వివరించగా, ఆయన బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ట, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, డాక్టర్ డీపీసీరావు, కొకిమళ్ల విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి..

ఖమ్మంమయూరిసెంటర్: వర్షాలు, వరదలతో ప్రాణ, ఆస్తి, పంట నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కమిటీ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం, వ్యక్తిగత దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.రాజేంద్రప్రసాద్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ, పాలేరు డివిజన్ కార్యదర్శి బజ్జూరి వెంకటరామిరెడ్డి, జిల్లా సెక్రటేరియట్ సభ్యులు షేక్ ఖాసిం, వై.ప్రకాష్, ఐ.వెంకన్న, జిల్లా కమిటీ సభ్యులు వీవీరావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరగాలి



మాట్లాడుతున్న అదనపు డీసీపీ నరేష్‌కుమార్

ఖమ్మంక్రైం: గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా పూర్తయ్యేలా అందరూ సహకరించాలని అదనపు డీసీపీ నరేష్‌కుమార్ సూచించారు. ఖమ్మం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిమజ్జనానికి కండీషన్‌లో ఉన్న వాహనాలను సమకూర్చుకోవడంతో పాటు పోలీసుల సూచనలు పాటిస్తూ నిర్ణీత సమయానికి పూర్తిచేయాలని తెలిపారు. తొలుత కాల్వొడ్డు, ప్రకాశ్‌నగర్‌లలో నిమజ్జన ప్రాంతాలను ఏసీపీలు రమణమూర్తి, సుశీల్‌కుమార్, సీఐ రమేష్, ఆర్ఐ కామరాజుతో కలిసి ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యుత్ లైట్లు, బారికేడ్లు ఏర్పాటు తదితర అంశాలపై ఇప్పటినుంచే అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో దృష్టి సారించాలని తెలిపారు.

అన్నప్రసాద వితరణ..

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్ ఫోర్ వీలర్స్ ది ఆటో టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న శ్రీ కాణిపాక విఘ్నేశ్వర 21వ మహోత్సవ కార్యక్రమంలో గణేశ్ దీక్షా భక్తుల అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని మంగళవారం ఖమ్మం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు యర్రం బాలగంగాధర్ తిలక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మహంకాళి మల్లిఖార్జునరావు, వెంకటరెడ్డి, రాందాస్‌నాయక్, రామకృష్ణ, శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: చేనేత కార్మికులు బ్యాంకుల్లో తీసుకున్న రూ.30 కోట్ల రుణాలను మాఫీ చేసినందుకు, ఐఐహెచ్‌టీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టినందుకు, పాత బకాయిలు రూ.290 కోట్లు మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుల చిత్రపటాలకు పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి ఆధ్వర్యాన పాలాభిషేకం చేశారు. మంగళవారం మంత్రి తుమ్మల క్యాంపు ఆఫీస్‌లో కార్యక్రమం జరుగగా.. చిలకమర్రి శ్రీనివాస్ బాబు, తాటి శ్రీను, పెండెం జనార్దన్, బండారు శ్రీను, గుడ్ల వీరభద్రం, దుస్సా సత్యనారాయణ, పులిపాటి సంపత్, పిల్లలమర్రి కొండల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న దృశ్యం

ఖమ్మంవన్‌టౌన్: ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్‌ఎఫ్ ఫండ్ చెక్కులను మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. పాలేరు, వైరా, మధిర నియోజకవర్గాలకు చెందిన మొత్తం 65 చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో మద్దినేని స్వర్ణకుమారి, చావా శివరామకృష్ణ, కొప్పుల అశోక్, క్లోం వెంకటరెడ్డి, మద్ది మల్లారెడ్డి, కర్లపూడి భద్రకాళి, మద్ది కిషోర్‌రెడ్డి, మందపల్లి నాగమణి, తిప్పిరెడ్డి రాజశేఖర్, వెంపటి రవి, తదితరులు పాల్గొన్నారు.

సన్మానాలు

నేలకొండపల్లి: తెలంగాణ రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్‌గా నియమితులైన కోదాడ ఎమ్మెల్యే ఎన్.ఉత్తమ్ పద్మావతిని పాలేరు డివిజన్ కాంగ్రెస్ నాయకుడు, మోటాపురం సొసైటీ మాజీ డైరెక్టర్ రావెళ్ల కృష్ణారావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం కోదాడలో కలిసిన ఆయన ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపాక ఘనంగా సన్మానించారు. ఆయన వెంట వేమూరి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు..

తిరుమలాయపాలెం: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పెసర ప్రభాకర్‌రెడ్డిని మంగళవారం తిరుమలాయపాలెం జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం విజయకుమారి మాట్లాడుతూ.. తమ పాఠశాలకు చెందిన బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడికి ఎన్నో ఏళ్ల కృషి ఫలితంగా ఈ అవార్డు దక్కిందని, అందరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నేలకొండపల్లి: మండలంలోని శంకరగిరితండా, కోనాయిగూడెం గ్రామాల్లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించాక వైద్యాధికారి గీత మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి బిందు, ఆరోగ్య విస్తీర్ణాధికారి గోపికృష్ణ, ఏఎస్ఎం పద్మ, ఆశా కార్యకర్త చెరుకుపల్లి బేబి పాల్గొన్నారు.

తమ్మినేని నివాళి

ఖమ్మంరూరల్: మండలంలోని కాచిరాజుగూడెంకు చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు పొన్నం కాశేశ్వరరావు(65) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈమేరకు కాశేశ్వరరావు మృతదేహాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సందర్శించి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు బి.రమేష్, నండ్ర ప్రసాద్, వై.విక్రమ్, భూక్యా వీరభద్రం, సురేష్, నాగేశ్వరరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ గ్రీష్మ

ఖమ్మం మామిళ్లగూడెం: మహిళా సాధికారతకు మహిళలే కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మం టీటీడీసీ భవనంలో తెలంగాణ పోరాటయోధురాలు చిట్యాల ఐలమ్మ వర్ధంతి సందర్భంగా వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా ఉపాధ్యక్షురాలు త్రివేణి అధ్యక్షతన మహిళా రిజర్వేషన్లు, బీసీ మహిళా కోటా అంశంపై జరిగిన సదస్సులో డాక్టర్ గ్రీష్మ, రచయిత్రి దాసోజు లలిత మాట్లాడారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం మహిళలకు ప్రకటించిన రిజర్వేషన్లను త్వరితగతిన అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జిలకర శ్రీనివాస్,ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బానోతు భద్రూనాయక్, నాగయ్య, షేక్.నజీమా, శ్రీదేవి, లక్ష్మి, ఉపేంద్రబాయి, కిరణ్మయి, విజయ్, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ జీవితం ఆదర్శప్రాయం



ఖమ్మం మామిళ్లగూడెం: పాత కలెక్టరేట్ ఎదుట నివాళులర్పిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం బాధ్యులు

చాకలి ఐలమ్మ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయ మని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం ఐలమ్మ వర్ధంతి వేడుకలను పలు సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనగామ జిల్లాకు చిట్యాల ఐలమ్మ పేరు పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. – సాక్షి నెట్‌వర్క్



నేలకొండపల్లిలో బీజేపీ నేత నివాళి

బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

నేలకొండపల్లి: నేలకొండపల్లి మేజర్ గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం బీసీలకు రిజర్వేషన్ కేటాయించాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో బీసీలు ఎక్కువ మంది ఉన్నందున ఈ సారి రిజర్వేషన్ బీసీలకే ఇవ్వాలన్నారు. ఏళ్ల తరబడిగా జనాభా లెక్కలు చేయకుండా జాప్యం చేస్తున్నారని వెంటనే కులగణన, జనాబా గణన చేసి అన్ని రాజకీయ పార్టీల నాయకులు బీసీలకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. నేలకొండపల్లి పంచాయతీలో పోటీ చేసే బీసీలకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.